అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని గుర్ల అంగన్వాడి కేంద్రాన్ని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జడ్పిటిసి శీర అప్పల నాయుడు వైసీపీ నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు శనివారం పరిశీలించారు. చిన్నారులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి ప్రభుత్వం ఇస్తున్న మెనూ ప్రకారం పౌష్టికాహారం పిల్లలకి అందించాలన్నారు. మండల కేంద్రంలో ఉన్న మూడు అంగన్వాడి కేంద్రాలుకు విద్యుత్ సౌకర్యానికి, మరమ్మతులకు రూ.2.50 లక్షలు మండల పరిషత్ విధులు నుండి మంజూరైనట్లు ఎంపీపీ ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో పశుగణ అభివృద్ధి చైర్మన్ బంగారు నాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతిరావు, గ్రామ వైసిపి నాయకులు ప్రసాద్, సీతారాం పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: వ్యాన్ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన ఎస్‌కోటలో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... మెంటాడ మండలం, పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మోషే(23) విశాఖలో బైక్ కొనుగోలు చేసుకొని ఎస్‌కోట కు శుక్రవారం రాత్రి తిరిగి వస్తుండగా ఎస్.కోట ఆకుల డిపో నవీన్ స్టూడియో ఎదురుగా విశాఖ-అరకు ప్రధాన రహదారి వద్ద ఐచర్ వ్యాన్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో యువకునికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ జె.తారకేశ్వరరావు శనివారం తెలిపారు. మృతుడు మోషే భార్య నాగేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్.ఐ వెల్లడించారు.

పోయిన బ్యాగును అందజేసిన పోలీసులు

విశాలాంధ్రం-విజయనగరం క్రైమ్: పోగొట్టుకున్న ఓ బ్యాగును విజయనగరం ఒకటవ పట్టణ పోలీసులు శనివారం బాధితుడికి అందజేశారు. గరివిడికి చెందిన కోరాడ అచ్చం నాయుడు ఈనెల 21న ఆటోలో ప్రయాణిస్తూ, బ్యాగును పోగొట్టుకొన్నట్లు 1వ పట్టణ పోలీసు స్టేషన్ కు సమాచారం ఫిర్యాదు చేయడంతో సిఐ బి.వెంకట్రావు వెంటనే స్పందించి, సిబ్బందిని పంపించి, ఆటోను ట్రేస్ చేసి, పోగొట్టుకున్న బ్యాగును బాధితునికి అందజేశారు. సకాలంలో స్పందించి పోగొట్టుకున్న బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి బాధితునికి అందజేసిన పోలీసులు పనితీరుపై బాధితుడు ఆనందం వ్యక్తం చేసి, వన్ టౌన్ సిఐ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

గుంకలాం లేఅవుట్‌ను సందర్శించిన కలెక్టర్ సూర్యకుమారి

లబ్ధిదారులకు మరింత తోడ్పాటు అందించాలని అధికారులకు సూచన

విశాలాంధ్ర-విజయనగరం : సామూహిక గృహ ప్రవేశాల చేసేందుకు అనుగుణంగా ఉగాది నాటికి అన్ని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి ఆదేశించారు. లబ్ధిదారులకు తోడ్పాటు అందించాలని నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఆకాంక్షల మేరకు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గుంకలాంలో చేపట్టిన అతి పెద్ద లేఅవుట్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లేఅవుట్లో కలియ తిరిగి జరుగుతూ పనులను స్వయంగా చూశారు. ఈ క్రమంలో లబ్ధిదారులతో మాట్లాడారు. వేగంగా జరుగుతున్న నిర్మాణాలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత ముమ్మరంగా సాగించేందుకు అందరూ ఉత్సాహంగా పని చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. లేఅవుట్ సందర్శనలో భాగంగా ముందుగా ఆమె ఇంటి నిర్మాన సామాగ్రి నాణ్యతా పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. దాని ద్వారా అందించే సేవల గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇనుము, రాయి, ఇసుక ఇతర సామాగ్రి నాణ్యతను ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షించాలని సూచించారు. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులపై గృహ నిర్మాణ శాఖ పీడీ, డీఈ, స్థానిక మున్సిపల్ కమిషనర్, విద్యుత్ సిబ్బంది, స్థానిక తహశీల్దార్, సచివాలయ ఉద్యోగులను ఉద్దేశించి ఆమె పలు సూచనలు చేశారు. సామూహిక గృహ ప్రవేశాలను అట్టహాసంగా నిర్వహించేందుకు అందరూ సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాలకు సంబంధించి జరిగిన చెల్లింపుల గురించి సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆమె వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ రమణ మూర్తి, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, తహశీల్దార్ బంగార్రాజు, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

జగనన్న గోరుముద్ద ను ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం లోచర్ల ఎంపీయుపి, ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంపీడీఓ ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం వండిన పదార్థములను పరిశీలించి విద్యార్థులతో సహా భోజనం చేశారు. తదుపరి సమ్మెటివ్ 1 పరీక్ష మూల్యాంక పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం మొక్కలు పాతారు. తదుపరి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి భోధనతో పాటుగా విద్యార్థి చదవడం మరియు రాయడంలో పట్టు సాధించేటట్లు శిక్షణను ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రోప్ స్కిప్పింగ్ టీమ్స్‌కు కోచ్‌గా ఉదయ్‌కుమార్

విశాలాంధ్ర-గరివిడి: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పోటీలకు కాపు సంభాం వ్యాయమ ఉపాధ్యాయుడు మోయిద ఉదయ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 21 నుండి 24 వరకు ఐఎన్‌సిటి యూనివర్సిటీ భోపాల్ జరగుతున్న అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ పోటీలకు మన ఆంధ్ర యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ మెన్ అండ్ ఉమెన్ టీమ్స్ కు కోచ్ గా వ్యవహరి స్తున్నారు. ఆయనను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

23 నుంచి అలుగోలులో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 23 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వి రమణ, ఎంఇఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మార్సీలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 23 నుంచి 25 తేదీ వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 13 బాలురు, 13 బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు. 23న ఉదయం 10 గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం నల్లా జగదీశ్వరరావు, పీడీ ఎస్ సూర్యారావు, సీఆర్పీ బి వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ ఇందనం ఆదా చేసి భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

విశాలాంధ్ర-వేపాడ: ప్రస్తుతం ప్రకృతిలో మార్పు సంభవిస్తున్న తరుణంలో సహజ వనరుల లభ్యత తగ్గుముఖం పడుతున్న వేళ దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన మూలమైన ఇంధన శక్తిని ఆదా చేసే దిశగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని వేపాడ శివారు బక్క నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలలో శనివారం ఇంధన శక్తి పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆర్ ఈశ్వరరావు మాట్లాడుతూ అవసరం మేరకే ఇంధన శక్తి ఉపయోగించాలని హితవు పలికారు. ముందుగా పాఠశాల విద్యార్థులతో ఇందన శక్తి పరిరక్షణ ఫ్లెక్సీ ప్లకార్డులతో బక్కు నాయుడుపేట గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఇంధనశక్తి పరిరక్షణపై క్విజ్ పోటీలు, వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్ : ఏఎస్పీ అస్మా ఫరిణ్

విశాలాంధ్ర-భోగాపురం: యువతే దేశ భవిష్యత్తని మాదకద్ర వ్యాలకు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్ఇ బి ఆడిషనల్ సూపరింటెండె అఫ్ పోలీస్ అస్మా ఫరిణ్ అన్నారు. మిరకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం ప్రారంభించి అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకై అవగాహన సదస్సు లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె యువతనుద్దేశించి మాట్లాడుతూ జీవితాన్ని ఆస్వాదించండి కానీ చదువును నిర్లక్ష్యం చేయవద్దని, లక్ష్యం వైపు దూసుకుపోవాలన్నారు. సిఐ విజయనాథ్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వాడటం ప్రారంభిస్తే వాటి నుంచి బయటపడటం అసాధ్యమన్నారు. కార్యక్రమంలో మిరకిల్ కళాశాల డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ అర్జునరావు,ఎం జి ఒ మేనేజర్ నజీర్, పోలిపల్లి పి.హెచ్.సి వైద్యులు తిరుపతి స్వామి, ఎస్ ఇ బి ఇన్స్పెక్టర్ ఎం ఆర్ వి అప్పారావు, పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఎస్ఐ లోకేశ్వరరావు ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-వంగర :మండలంలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ లోకేశ్వరరావు సిబ్బంది, విద్యార్థులతో గ్రామ పురవీధుల్లో ప్రజలకు స్లోగన్ లు,ప్లే కార్డ్ లు ద్వారా అవగాహన కల్పించారు. అలాగే మండల కేంద్రంలో స్థానిక బస్ స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు, ప్రయాణికులతో మమేకమై రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు రూల్స్ పట్ల అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ నారాయణరావు, సిబ్బంది, స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏపీవో పై టెక్నికల్ అసిస్టెంట్ పోలీసులకు ఫిర్యాదు

బైండోవర్ కేసు నమోదు

విశాలాంధ్ర-పూసపాటిరేగ: ఉపాధి హామీ ఏపీవో తనను మానసికంగా వేధిస్తున్నారని కార్యాలయంలో జరుగుతున్న విషయాలు రహస్యాలు ఉన్నతాధికారులకి తెలిసిపోవడంతో దానికి గల కారణం తానేననే అనుమానం తో నన్ను టార్గెట్ చేస్తున్నాడని. పనివేళ దాటిన తర్వాత కూడా పనిచేయమని వేధిస్తున్నాడని ఇదే కొనసాగితే నాకు ఆత్మహత్య శరణ్యమని టెక్నికల్ అసిస్టెంట్ పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకెళ్తే మూడు సంవత్సరాలుగా లోకవరపు భవాని ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. తన సుపీరియర్ ఏపీవో గువ్వల కనకరాజు గత కొద్ది కాలంగా తనను వేధిస్తున్నారని కార్యాలయంలో అతికష్టమైన పనులన్నీ తనకు అప్పచెబుతున్నారని తను వర్క్ చేయవలసిన గ్రామాలు మండలంలో దూరం దూరంగా ఉండే విధంగా ఏర్పాటు చేసి సరైన సమయంలో పనిపూర్తి అవ్వకపోవడం సాకుగా చూపించి ఆఫీస్ సమయం తర్వాత కూడా వర్క్ చేపిస్తున్నారని పని పూర్తిగానే పక్షంలో దుర్భాషలాడుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ విషయంపై మండల ఎంపీడీవో రామారావు కూ ఫిర్యాదు చేసిననా స్పందించకపోవడంతో పోలీస్‌స్టేషన్లో కంప్లైంట్ ఇస్తున్నానని ఆమె మీడియాకు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై నరేష్ స్పందిస్తూ ఇందులో క్రిమినల్ అంశం లేకపోవడం వల్ల ఏపీఓపై, పై అధికారులకు ఫిర్యాదుచేయాలని తెలిపి బైండోవర్ కేసు నమోదు చేసామని తెలిపారు.

తూర్పు గోదావరి మిల్లులకు ధాన్యం తరలింపునకు అనుమతి లేదు

వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ వెల్లడి

విశాలాంధ్ర-జామి: మండలంలోని పలువురు రైతులు తమ ధాన్యంను ప్రవేటు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్న మాట వాస్తవమేనని కానీ ఈధాన్యంకు ఆర్‌బికెలకు ఎటువంటి సంభందం లేదని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం విశాలాంధ్రలో ప్రచురితమైన ప్రభుత్వ నిర్లక్ష్యం-దళారులవైపు ధాన్యం రైతు కథనంపై ఆయన స్పందించారు. మండలంలో ధాన్యం సేకరణను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రవేటు వ్యాపారులు తూర్పుగోదావరి జిల్లాలోని మిల్లులకు తరలింపులు చేస్తున్నారని వారికి ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం సూచించిన మిల్లులకు మాత్రే ట్రక్కు షీట్‌లను ఇవ్వడం జరుగుతోందన్నారు. రైతులు తమ ఇష్టపూర్వకంగానే ప్రవేటు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారని, ప్రభుత్వ పరంగా సేకరణ మాత్రం కొనసాగిస్తున్నామని తెలిపారు.

ఆరోపణలు సరికాదు :ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపై ఏపీ ఎన్జీవో సంఘం బురదజల్లే కార్యక్రమం సరైన పద్ధతి కాదని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి రామచంద్రరావు, కంది వెంకటరమణ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల తరఫున ఏపీజీ ఈ ఏ గవర్నర్ ను కలిసి ఏపీ జి ఎల్, పిఎఫ్, నెలవారి జీతాలు వంటి సమస్యలు పరిష్కారం తదితర సమస్యలను తెలియజేస్తే ఏ పి ఎన్ జి ఓ సంగం వ్యక్తిగత విమర్శలు సరైన పద్ధతి కాదన్నారు ఏ పి జి ఈ ఏ సంఘం గుర్తింపు రద్దు చేయాలని కోరడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గవర్నర్ ని కలిసి సమస్యలు తెలియజేస్తే అండగా నిలవాల్సింది పోయి ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్ వి యుగంధర్, పువ్వుల శ్రీనివాసరావు, బాల భాస్కరరావు, వై శంకర్రావు, బాలాజీ పాణిగ్రహి పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని పాతబగ్గం గ్రామంలో మహిళలకు శనివారం మునగ మొక్కలు శనివారం సర్పంచ్ లంక పద్మావతి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వైయస్సార్ క్రాంతి పదం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాకు వినియోగం వల్ల పోషకాహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు లంక చిన్నమనాయుడు వెలుగు వివో ఏ నాగమణి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ : జిల్లా అదనపు జడ్జి దామోదర్ రావు

విశాలాంధ్ర-బొబ్బిలి: వివిధ కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులు పరిష్కారం కోసం సత్వర న్యాయం కోసం భారత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న బొబ్బిలి కోర్టు ప్రాంగణంలో జరుగు జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయడానికి సంబంధిత పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు సహాయ సహకారాలు అందించాలనిపార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్ దామోదర్ రావు, స్థానిక కోర్టు మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి టి వాసుదేవన్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటుపై స్థానిక న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి దామోదర్ రావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ జాతీయ లోక్ అదాలత్ విజయ వంతం చేయాలని అందుకు సంబంధిత న్యాయ వాదు లు కృషిచేయాలని, జాతీ య లోక్దాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కా రంచేస్తామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి కక్షిదారులకు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, మరియు క్రిమినల్, ఫ్రీ లిటిగేషన్ ఇరువర్గాలు రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం చేసుకుంటే విలువైన సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు ఎం సరోజనమ్మ, సౌమ్య జోష్ఫాని, న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు చోడి గంజి రామారావు, కార్యదర్శి దాసరి అప్పలరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులకే డాక్టర్ వైయస్సార్ పొలంబడి

విశాలాంధ్ర-పాచిపెంట: ఆరోగ్య వంతమైన పంట పండిస్తూ ఖర్చులను తగ్గించుకుని పర్యావరణానికి ఎలాంటి హాని జరగ కుండా అధిక దిగుబడులు పొందడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా డాక్టర్ వైయస్సార్ పొలంబడులు ఏర్పాటుచేశారని సాలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రావు అన్నారు మాతుమూరు రైతుభరోసా కేంద్రం పరిధిలో తాడూరు గ్రామంలో ఏర్పాటుచేసిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో మొక్కజొన్న పంటపై తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను వివరిస్తూ రైతులు నిరంతరం పంటల పరిశీలన జరపాలని మిత్ర పురుగులు శత్రు పురుగులను గుర్తించగలగాలని మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నట్లయితే పురుగు మందుల పిచికారి ఆపాలని పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా పంటలను పండించే విధంగా రైతులకు సాగులో నూతన సాంకేతిక సలహాలను అందించడానికి తద్వారా పొలంబడి లో పాల్గొ న్న రైతులను ఆ పంటలకు కావలసిన పూర్తి పరిజ్ఞానాన్ని అందించి రైతులను నిష్ణాతులగా చేయడానికి 14 వారాలపాటు పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శనగల సింహాచలం, గ్రామ పెద్ద డిరామువ్యవసాయ అధికారి కే తిరుపతిరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు..

జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర-బెలగాం : జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పార్వతీపురం మన్యం జిల్లా ఇంఛార్జి బాధ్యులు గుజ్జల ఈశ్వరయ్య, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త, సిపిఐ సీనియర్ నాయకులు పి.కామేశ్వరరావు అన్నారు. శనివారం సిపిఐ మన్యం జిల్లా కార్యవర్గసభ్యులు, సమితి సభ్యులతో జనరల్ బాడీ సమావేశం పార్వతీపురం మన్యం జిల్లా బెలగాం మండలంలో స్థానిక రైతు బజార్ సమీపంలో ఉన్న రిటైర్డు ఎంప్లాయిస్ సంఘ భవనంలో పార్వతీపురం మన్యం జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న కాలనీ లని చెప్పి 32లక్షల ఇళ్లు మంజూరు చేశామని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లెక్కలు చెబుతోందని, అయితే వాటికి సిమెంటు, ఇసుక ఉచితంగా ఇవ్వడంతో పాటు నిర్మాణ వ్యయం క్రింద 5లక్షల రూపాయలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు చెబుతున్న జగనన్న కాలనీలో ప్రభుత్వలక్ష్యాలు నెరవేరలేదన్నారు. దీనికి కారణం కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, నీరు, కాలువలు, రోడ్లు కల్పించకపోవడమేనని అన్నారు. జగనన్న కాలనీలో ఇళ్లస్థలాల విస్తీర్ణంకూడా పెంచాలని డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్రంలోని టిడ్కోఇళ్ళ నిర్మాణాలు ఇంతవరకు పూర్తిచేయలేదన్నారు. ప్రకటనలే తప్ప వాస్తవంగా ఎక్కడా కూడా టిడ్కోఇళ్లను ప్రభుత్వం లబ్దిదారులకు ఇవ్వలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు టిడ్కో ఇళ్లకు ప్రతి ఇంటికి 50వేల రూపాయలు చొప్పున్న డిపాజిట్ కట్టించారని మేము అధికారంలోకి వస్తే ఫ్రీగా కట్టించి ఇస్తామని అన్నారని గుర్తు చేశారు. జగనన్న కాలనీలో ఇళ్ళ స్థలాలు పట్టణ ప్రాంతాల్లో 2.సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3.సెంట్లు స్థలాన్ని ఇవ్వాలని సిపిఐ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో మన్యంజిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పల నాయుడు, ఈదుబిల్లి వెంకటనాయుడు, గరుగుబిల్లి సూరయ్య, మండంగి లింగరాజు, కూరంగి గోపినాయుడు, జిల్లా సమితి సభ్యులు ఎస్. దుర్గారావు, బిటి నాయుడు, ఎస్. కిరణ్ కుమార్, రాగోలు పకీరు, నాగభూషణరావు పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయండి

కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-సాలూరు రూరల్: జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులతో జగనన్న కాలనీ లే అవుట్ లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సాలూరు అర్బన్, రూరల్ జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు ప్రస్తుతం ఏ ఏ దశలో ఉన్నయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా పనిచేసి అయా గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. సకాలంలో రుణాలు అందించడం ద్వారా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయవచ్చని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లకు సూచించారు.ఇళ్ల నిర్మాణాల లక్ష్య సాధనలో ప్రగతి స్పష్టంగా కనిపించాలని, లేని పక్షంలో బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందుగా గృహ సామాగ్రి అందజేసి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ సకాలంలో అందిస్తున్నామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.రూరల్ గృహ నిర్మాణాల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశం లో గృహ నిర్మాణ శాఖ డి ఈ జి.సోమేశ్వర రావు, మున్సిపల్ కమీషనర్ హెచ్. శంకర రావు, తశీల్దార్ కె.భాను ప్రసాద్, ఎంపీడీఓ జి.పార్వతీ, గృహ నిర్మాణ శాఖ అర్బన్, రూరల్ ఏ ఈ లు టి.శ్రీనివాస రావు, కె.సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ సింహాచలం, వై యస్ ఆర్ క్రాంతి పథం ఏ పి ఎమ్ జి.సింహాచలం, తదితరులు, పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఏపీ రైతు సంఘం ఆర్డీవోకు వినతి

విశాలాంధ్ర-బెలగాం: 2022-23 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణలో జిల్లా యంత్రాంగం తీసుకున్న చొరవకు ఏపీ రైతుసంఘం జిల్లా రైతాంగం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పార్వతీపురం ఆర్.డి.ఓ, ఇంచార్జి డిఆర్ఓ కె.హేమలతకు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ పున: ప్రారంబించాలనే లక్ష్యంతో సంభంధం లేకుండా రైతువద్ద ఉన్న ధాన్యమంతటిని కొనుగోలు చేయాలని కోరుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం 2022-23 ఖరీఫ్ సాగు విస్తీర్ణం 71,371 హెక్టార్లు నుండి సరాసరి ధాన్యం ఉత్పత్తి 3,18,734 మెట్రిక్ టన్నులలో 1.92 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని వరిపంట పండిస్తున్న 88వేల మంది రైతులనుండి కొనుగోళ్లు చేస్తామని జిల్లా అధికారులు ప్రకటించి వున్నారని, 2023 జనవరి 12వ తేదీ నాటికి సుమారు 1/72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులనుంచి సేకరించాము లక్ష్యం పూర్తికావస్తుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రకటించివున్నారని అన్నారు. తక్షణమే ఆన్లైన్ ప్రక్రియను పున: ప్రారంబించాలని అంతేకాక రైతువద్ద ఉన్న ధాన్యం అంతంటిని కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో సాగవుతున్న 72వేల హెక్టార్లకు గాను 5,004 మెట్రిక్ టన్ను లు అవసరంకాని నేడు రైతు తమ ధాన్యంలో కేవలం ఒక అంచనా ప్రకారం 2,000 టన్నులు మించి తమ స్వంత విత్తనం కట్టుకోవడం లేదని, తిండి గింజల కోసం సరాసరి 50 వేల మెట్రిక్ టన్నులకు మించి రైతు వద్ద ధాన్యాన్ని అదనంగా నిల్వ పెట్టుకోవడం లేదని, కావున పై గణాంకాలు ప్రకారం రైతుల వద్ద సుమారు 1లక్ష టన్నులు వరకు ధాన్యం కొనుగోలు చేయవలసిఉందని, ప్రస్తుతం పాలకొండ, వీర ఘట్టం మండలాల్లో 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు అమ్మకానికి సిద్దంగా ఉన్నారన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సంఘం నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, గుజ్జ జనార్దనరావు, సిహెచ్ కేశవరావు, కె. అప్పలనాయుడు, బి. దుర్గారావు, ఎల్. నరసింహులు, సిహెచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సుధ, చంద్రమౌళి కుటుంబాలకు పరామర్శ

విశాలాంధ్ర-కురుపాం: ఇటీవల అనారోగ్యంతో మద్ది సుధాకర్ తండ్రి ప్రభాకర్ కలెక్టరేట్ ఉప తహాశిల్దార్ కుప్పిలి చంద్ర మౌళీ భార్య అకాలమరణ వార్తలు తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు శత్రుచర్ల. పరీక్షిత్‌రాజు శనివారం సాయంత్రం పరామర్శించారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి. పద్మావతి ,జడ్పీటీసీ సుజాత ,సర్పంచ్ సుజాత ,ఉపసర్పంచ్ ఆదిల్ ,మాజీ జడ్పీటీసీ అంధవరపు. కోటేశ్వరరావు,ఎంపీటీసీ బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు

పాలకొండ ఎమ్మెల్యే కళావతికి తీవ్ర అస్వస్థత

విశాలాంధ్ర-సీతంపేట: మండలం దోను భాయ్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయా అనే విషయం ప్రతి ఇంటికి వెళ్లి అడిగి తెలుసుకుంటున్న సమయంలో ఎమ్మెల్యే కళావతి ఒక్కసారిగా అస్వస్థకు గురవడంతో తక్షణమే స్పందించిన కార్యకర్తలు అధికారులు సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స నిర్వహించి కొంతమేర ఉపశమనం పొందిన అనంతరం ఎమ్మెల్యే కళావతి తిరుగు ప్రయాణం అయ్యారని అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు



విశాలాంధ్ర-పాలకొండ: దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహుళ జాతి సంస్థలకు ఊడిగం చేస్తూ రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను తీసుకురాగా, దానిని వ్యతిరేకిస్తూ జాతి స్థాయిలో 18 నెలల కాలం పాటు ఢిల్లీ నడిబొడ్డున లక్షలాదిమంది రైతులు నిరసన దీక్ష కార్యక్రమంలో ఉండగా ఉద్యమాన్ని హేళన చేసిన పాలక బిజెపి మంత్రివర్గం చివరికి ఎన్ని ఆటంకాలు సృష్టించినా, అపోహలు కల్పించినా అనేక మందిని పొట్టన పెట్టుకున్న వెన్ను చూపని విరోచక ఉద్యమం ఢిల్లీలో రైతన్న ఉద్యమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పల నాయుడు గుర్తు చేశారు. అందుకు సంబంధించిన గోడపత్రికను శనివారం పాలకొండ మండలం, కొండాపురం గ్రామంలో ఆవిష్క రించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరికి సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్యక్రమానికి వెళ్లి ఉద్యమకారులకు క్షమాపణ చెప్పి ఆనాడు చేసిన తమ చట్టాలను వెనక్కి తీసుకుంటామని రైతు పండించిన పంటలకు చట్టబద్ధత తెస్తామని, రైతులపై మోపిన కేసులన్నీ ఎత్తివేస్తామని, చనిపోయిన రైతన్న కుటుంబానికి ఆర్థికంగా పరిహారం ఇచ్చి ఆదుకుంటామని చేసిన వాగ్దానాలు నేటికీ నెరవేరకపోవడం హాస్యాస్పదమన్నారు. తిరిగి దేశవ్యాప్త రైతన్న మరో మహోత్సవానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కేంద్రం పార్వతీపురంలో పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఈ ర్యాలీలో రైతులు భాగస్వాములై జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తి నాయుడు, గ్రామ సర్పంచ్ ప్రతినిధి రాయి రామకృష్ణ, మాజీ సర్పంచ్ బలగ దుర్గారావు, వందాను కూర్మా రావు, త్రిపురాంతకరావు, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో గడప గడపకు కార్యక్రమం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీలో సచివాలయం-2లోని సీతానగరం గ్రామంలోని గూడెంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో "గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమంను శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగారావుకు వైఎస్సార్సీపీ నాయకులు ఆర్వీ పార్ధసారథి, ఆర్వీ కిషోర్, ఎంపీటీసీ బురిడి కుసుమ సూర్యనారాయణ, గౌరీకిరణ్,సచివాలయం కన్వీనర్లు, వార్డు సభ్యులు, గ్రామపెద్దలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలనుకలుసుకుని వారి యోగక్షేమాలను తెలుసుకొని,వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి ఆరాతీశారు.రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించి, దీవించి మరలా ముఖ్యమంత్రి చేయాలని, తమకు కూడా ఆశీస్సులను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపాటు ఎంపీపీ బలగ రవణమ్మ శ్రీరాములునాయుడు, జడ్పీటీసీ మామిడి బాబ్జి,మండల వైసీపీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, సర్పంచ్ తేరేజమ్మగరికయ్య,సహకార సంఘం అధ్యక్షుడు కూర్మారావు, ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు సకాలంలో బిల్లులు చెల్లించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జగనన్న కాలనీలలో నిర్మిస్తున్న ఇళ్లకు సకాలంలో బిల్లు చెల్లించేలా అధికారులు చర్యలు తీసు కోవాలని ఎమ్మెల్యే జోగారావు ఆదేశించారు. బలిజిపేట మండలం ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే అధ్యక్షతన మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు ప్రజా ప్రతినిధులతో కలిసి మండల పరిధిలోని గల గ్రామాల వారీగా జరుగుతున్న గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇంతవరకు మంజూరు చేసిన ఇల్లు 3,006 కాగా వాటిలో ఇప్పటికే 1061 ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకోనగా మిగతా ఇల్లు నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వాటి అన్నింటినీ సత్వరం పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాటలాడి సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలానే ఈ సమీక్షలో గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్యం అధికారులతో కలిసి గ్రామాల వారీగా చేపట్టిన ఇంటి ఇంటి కుళాయి పనులు ప్రగతిపై సమీక్షించారు. సమీక్షలో మండల ఎంపీపీ గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవి కుమార్, వైస్ ఎంపీపీలు బెవరా హేమలత, వెలిది సాయిరాం, ఎంపిడిఓ భాను మూర్తి, ఏంఅర్ఓ వివిఎస్ఎస్ శర్మ, హౌసింగ్ డిఈ రవి ప్రసాద్ బాబు, అర్ దబల్యుఎస్ డిఈ హనుమంత్ రావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల ఏఈలు, పాల్గొన్నారు.

జోగమ్మపేట సచివాలయంను తనిఖీ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని, జోగమ్మపేట గ్రామ సచివాలయంను ఎంపిడిఓ కృష్ణ మహేష్ రెడ్డి, ఈఓపిఆర్డీ వర్మలు శనివారం సందర్శన చేశారు. సచివాలయం ఉద్యోగుల ముఖహాజరు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో పాటు వాలంటీర్ల హాజరు పరిశీలించి పలు సూచనలు చేశారు.సచివాలయంలోని మూడు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీసారు. కార్యక్రమంలో కార్యదర్శులు కిరణ్, శ్రీనివాసరావు, వి ఆర్ ఓ శ్రీకాంత్, డిజిటల్ అసిస్టెంట్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ స్కూల్ గేమ్స్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు శనివారం తెలిపారు. ఎంపికయిన దొర అరుణ్‌కుమార్, అమలాపురం హారికలు ఈనెల 23వ తేదీ నుండి 25 వతేదీవరకు చిత్తూరు జిల్లా, మదనపల్లిలో జరగబోవు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. ఈ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ, రహీమ్ షేక్ లాల్, ఉపాధ్యాయులు అభినందిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

విశాలాంధ్ర-గుర్ల: మండలంలోని భవిత కేంద్రం వద్ద శనివారం దివ్యాంగులకు ఉచిత ఉపకారణాలను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జడ్పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి సూర్యనారాయణ రాజు సోమవారం పంపిణీ చేశారు భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు బస్సు పాసులు, వినికిడి యంత్రాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి చైర్మన్ బంగారు నాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతి రావు, విద్యాశాఖ అధికారి భాను ప్రకాష్, గ్రామ వైసిపి నాయకులు ప్రసాద్, సీతారాం, భవిత కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్టడీ మెటీరియల్ వితరణ

విశాలాంధ్ర-తెర్లాం: బాడంగి: మండలంలో మంగళవారం బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదువుతున్న ముగ్గురు దివ్యాంగ విద్యార్థులకు స్టడీమెటీరియల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని దమలపాటి శారద ఆర్థిక సహాయంతో హెచ్ఎం సిద్ధాంతం త్రినాథరావు ద్వారా అందజేశారు ఈ సందర్భంగా హెచ్ఎం త్రినాథరావు మాట్లాడుతూ ఈ మెటీరియల్ త్వరలో జరగబోవు పరీక్షలలో మంచి మార్కుల సాధన, సులువుగా చదువుకోవటానికి దివ్యాంగ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు చక్కగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ పరీక్షలు స్వయంగా రాయలేని వారికోసం ప్రభుత్వ నిబంధనలు ప్రకారం స్క్రైబ్ ఏర్పాటు జరుగుతుందని,పాస్ మార్కులలో కూడా సడలింపు ఉందని అంధ, వినికిడి లోపం విద్యార్థులకు 20 మానసిక, ఆటిజం,సిపి విద్యార్థులకు 10 మార్కులు వస్తే పాస్ అని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగులు,వారి తల్లిదండ్రులు,ఫిజిక్స్ ఉపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : పతివాడ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పతివాడ నారాయణ స్వామినాయుడు అన్నారు. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, చంద్రమ్మపేట, టెక్కలి గ్రామాలలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ స్వామినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతును నొక్కడానికి వైసిపి ప్రభుత్వం జీఓ నెం 1ని తీసుకొచ్చిందని చెప్పారు. వైసిపి నాయకుల అన్యాయాలను ప్రశ్నిస్తే కేసుల నమోదు చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, పోతల రాజప్పన్న, బెల్లాన రాజినాయుడు, మొయిద సీతంనాయుడు, నేతేటి స్వామినాయుడు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం గున్న తోట వలస రోడ్డులో గల మసీదు వద్ద ఆటో బోల్తాపడిన సంఘటనలో ఆరుగురు వ్యక్తులు గాయాలైనవి. క్షతగాత్రులను 108 వాహనంలో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా మండలం గున్న తోట వలస గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాస్,బడబల్ల నాగమణి,పప్పల పార్వతి, ఏ సత్యవతి, ఈశ్వరమ్మ, ఎస్ భారతి లకు ప్రథమ చికిత్స అందించారు. గున్న తోట వలస నుంచి రైల్వే స్టేషన్ కు వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు తెలిపారు. ప్రమాద సంఘటనపై బొబ్బిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లి ఔదార్యాన్ని చాటుకున్న ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల సమీపంలోని ఊటగెడ్డ వద్ద సంభవించిన రహదారి ప్రమాదంలో క్షతగాత్రులను ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు తన కారులో ఆసుపత్రికి తీసుకెళ్లి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఊట గెడ్డ వద్ద శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముళ్లు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న ఎమ్మె ల్సీ సురేష్‌బాబు తన కారులో క్షతగా త్రులను ఎక్కించుకుని మిమ్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మిమ్స్ వైద్యులకు సూచించారు.

'విద్యాసంస్కరణలు ఉపాధ్యాయులపాత్ర' పై సెమినార్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: భారతదేశంలో విద్యాసంస్కరణలు ఉపాధ్యా యులపాత్ర అనే అంశంపై శనివారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షక్ మండలి జాయింట్ ఆర్గనైజేష ఆర్గనైజషన్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ పాల్గొని సమాజాన్ని చైతన్య పరిచేందుకు సామజిక అంశాలపై అందరు అవగాహన కలిగిఉండాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పరస్పరం విద్యా విషయాలలో సహాయ సహకారాలను అందిపుచ్చుకోవాలని అలాగే ప్రతి ఉపాధ్యాయుడు సమాజంలో జరిగే వివిధ మార్పుల పట్ల చైతన్యవంతుడై, ఎక్కు వగా నైపుణ్యాలను కలిగి ఉండాలని వాటిని విద్యార్థులకు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తేజస్వి కట్టిమని మాట్లాడుతు సమాజంలో రాబోయే మార్పులను ముందుగానే గ్రహించి తదనుగుణంగా సిలబస్ రూపొందించాలని సిటియు లో విద్యార్థులకు విద్యతో పాటు జీవనభృతినిచ్చే వివిధ నైపుణ్యాలపైనే దృష్టిని కేంద్రీకరిచామని తెలిపారు. అనంతరం క్యాంపస్ లో స్వామి వివేకానంద మరియు సుభాష్ చంద్ర బోస్ ల జన్మ దినోత్స వాలను పురస్కరించుకొని "కర్తవ్య బోధ దివస్" ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారి నిర్వహణపై ఫిర్యాదు

విచారణ చేపట్టిన ఐటీడీఏ పీఓ నవ్య

విశాలాంధ్ర-సీతంపేట: మండలం సామరెల్లి పంచాయితీ రాయకురిడి గ్రామంలో గ్రానైట్ తవ్వకాల ద్వారా తమ చుట్టుపక్క గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నామని తమ పంటలు నాశనం అవుతున్నాయని గ్రామస్తులు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి నవ్యకు ఫిర్యాదు చేయడంతో శనివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రెవెన్యూ బృందంతో వెళ్లి గ్రానైట్ నిర్వహకులను పిలిపించి వారి వద్ద ఉన్న అనుమతి పత్రాలు వాటి నిర్వహణకు సంబంధించి మైన్స్ అధికారులు మంజూరు చేసినటువంటి పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని పిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలస్థాయి లో పరిష్కారం కాని అంశాలను జిల్లాస్థాయికి తేవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం: మండలస్థాయిలో జరిగిన సఖీ సమావేశంలో పరిష్కరించలేని అంశాలను జిల్లా స్థాయి సమావేశంలో చర్చించాలని, కన్వర్జెన్స్ సమావేశం లో చర్చించి పరిష్కారాన్ని చూడవచ్చని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో జిల్లా స్థాయి సఖి సమావేశం కలెక్టర్ ఆధ్వర్యం లో జరిగింది. ఈ సమావేశం లో కలెక్టర్ మండల వారీగా జరుగుతున్న సమావేశాల పై సమీక్షించారు. ఎలాంటి సమస్యలు వస్తున్నాయి, ఎలా పరిష్కారం జరుగుతున్నాయి అనే అంశాలపై ఆరా తీసారు. కొత్తగా వివాహం జరిగిన జంటలను గ్రూప్ లు గా చేయడం, వారితో సమావేశాలు నిర్వహించడం ఎలా జరుగుతోందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశాలకు తప్పనిసరిగా సర్పంచ్ లు హాజరు కావాలని, అపుడు మాత్రమే ఆ గ్రామానికి చెందిన సమస్యలు వారికీ తెలియడమే కాకుండా వాటికి తగు పరిష్కారం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం జిల్లా పంచాయతి అధికారి సర్పంచ్ లందరికీ సర్కులర్ జరీ చేయాలనీ సూచించారు. సఖీ సమావేశాలు ప్రభుత్వ పాఠశాలలలో, ప్రైవేటు పాఠశాలలతో పాటు హాస్టల్స్ కూడా నిర్వహించాలని తెలిపారు. ప్రతి 4వ శనివారం సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్య పాఠశాలలలో 1 గంట సఖీ సమావేశాలకు తప్పనిసరిగా ప్రధానో పాధ్యాయులు కేటాయించాలని, అందుకు ఒక సర్కులర్ జారీచేయాలనీ డి.ఈ.ఓ కు ఆదేశించారు. ఈ సమావేశాల వలన డ్రాప్ ఔట్స్ తగ్గడమే కాకుండా బాలికల్లో ఆత్మ స్థైర్యం పెరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో కొన్ని చోట్ల యువత డ్రగ్స్, మద్యం సేవించి ఆకతాయిలుగా తిరుగుతున్నారని తన దృష్టికి వచ్చిందని, ఈ విషయం లో పోలీస్ శాఖ వారు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశం లో ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంత కుమారి, డి.ఎం.హెచ్.ఓ డా. రమణ కుమారి, డి.ఆర్.డి.ఎ , మెప్మా పి.డి లు కళ్యాణ చక్రవర్తి, సుధాకర రావు, జిల్లా పంచాయతి అధికారి నిర్మల దేవి, సిపి.ఓ బాలాజీ, మండల ప్రత్యేకాదికారులు పాల్గొన్నారు.

రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలుకు యాప్

ఏఏబి సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అందుకోసం ప్రభుత్వం ఒక యాప్ ను రూపొందించినట్లు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, మిగిలిన ధాన్యాన్ని కూడా కొనుగోలుకు పారదర్శకంగా ప్రక్రియ జరగడానికి కొత్త నిబంధనలను రూపొందించడం జరిగిందన్నారు. మధ్యవర్తులను నమ్మి తక్కువ ధరకు అమ్మవద్దని, రెండ రోజుల్లో ధాన్యపు రాశులను ఫోటో తీసి యాప్ లో అప్ లోడ్ చేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. త్వరలో కొనుగోళ్ళు జరుగుతాయని రైతులు సహకరించాలని కోరారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో జిల్లాలో ఇప్పటికే లక్ష్యాలను మించి కొనుగోలు చేశామన్నారు. రవాణా, హమాలి ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించి రైతుల ఖతల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో రెండు రోజుల పాటు జరగనున్న చిరుధాన్యాల వర్క్‌షాప్ కు ప్రతి మండలం నుండి కనీసం 20 మంది చిరుధాన్యాలు పండించే రైతులను తీసుకురావాలని, వారికీ ఉత్తమ పద్ధతుల పై అవగాహన కలిగించాలని తెలిపారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ సీడ్ విలేజ్ ల ద్వారా స్థానికంగా విత్తనాలను అభివృద్ధి చేయాలనీ దీనివలన రైతులకు రవాణా చార్జీలు తగ్గడమే కాకుండా స్థానిక వాతావరణ పరిస్థిత కి తగ్గట్టుగా పంట దిగుబడి ఉంటుందని తెలిపారు. వచ్చేఖరీఫ్ నాటికీ ఈ విత్త నాలను అందించాలని జె.డి. త్రినాధస్వామి కి సూచించారు. ఎరువులు అమ్మకం లో నగదు తీసుకోకుండా డిజిటల్, ఆన్లైన్ ద్వారా నగదు చెల్లించేలా రైతులకు అవగాహన కలిగించాలని దీనివల్ల ఎటువంటి అవినీతికి తావుండదని తెలిపారు. సమావేశంలో ఏఏబి చైర్మన్ వెంకటేశ్వరరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తగినంత మంది ఉపాధ్యాయులు, విద్యాపర్యవేక్షణాధికారులను నియమించండి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : విద్యాశాఖలో తగినంత మంది ఉపాధ్యాయులు, పర్యవేక్షణ అధికారులను ప్రభుత్వం తక్షణమే నియమించి ఉపాధ్యాయులపై ఉన్న అదనపు భారాన్ని తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగి నాయుడు విజ్ఞప్తి చేశారు. శృంగవరపుకోట పట్టణంలోని ఎన్జీవో హోమ్ లో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు, తాలూకా ఇంఛార్జి సింగంపల్లి శివ విలేకరులతో శనివారం మాట్లాడుతూ విద్యాశాఖలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాపర్యవేక్షణ అధికారుల పనితీరు, ఉపాధ్యాయుల పనితీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసిందన్నారు. విజయనగరం జిల్లా మేరకు ప్రస్తుతం పనిచేస్తున్న డీఈఓ, డిప్యూటీ ఈఓలు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, మున్సిపల్ ఉపాధ్యాయులు శ్రమశిక్షణ తోనే, తీరిక లేకుండా నిజాయితీగా పనిచేస్తున్నారని మేము అభిప్రాయపడుతున్నాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక డిప్యూటీ ఈఓను, తగినంత మంది పీజీటీ, టీజీటీలను, స్కూల్ అసిస్టెంట్లను ఏపీపీఎస్సీ, డీఎస్సీల ద్వారా నియమించి పని ఒత్తిడిని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. ఆన్లైన్ పనులను, యాప్ ను వీలైనంత మేర తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జోగినాయుడు సూచించారు.

గృహ నిర్మాణాలు శత శాతం పూర్తయ్యే విధంగా కృషి చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: గృహ నిర్మాణాలు పూర్తయ్య విధంగా కృషి చేయాలని గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి ఎంపీడీవో ఆకిబ్ జావిద్ అన్నారు. శనివారం మండలంలోని పుట్బూరు గ్రామంలో మండల అధికారుల బృందం పర్యటించి జగనన్న లేఔట్లను పరిశీలించారు. ఇంకా ఇల్లు నిర్మించని లబ్దాలందరినీ పిలిచి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అఖిబ్ జావిద్ మాట్లాడుతూ ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం స్థలాన్ని ఇచ్చి ఇల్లు మంజూరు చేసిందని అదేవిధంగా ఇల్లు కట్టుకోవడానికి కొంత మొత్తాన్ని కూడా ప్రభుత్వం మంజూరుచేస్తుందని అయినప్పటికీ ఇంతవరకు ఇళ్ళ పూర్తి చేయక పోవడంపై కారణాలేటిని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఇంతవరకు ఎవరైతే ఇల్లులు ప్రారంభించలేదు వారందరినీ ఒక దగ్గర కూర్చోపెట్టి గ్రామ సభను నిర్వహించి సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు మధ్యన అందర్నీ పేరుపేరునా ఇల్లు నిర్మాణం పై అడిగి తెలుసుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా నిర్మాణం ప్రారంభించక పోతే వాటిని రద్దుచేసి మరొకరికి ఇల్లును ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ డి చిరంజీవులు, వెలుగు ఏపీఎం సురేష్ పంచాయతీ సెక్రెటరీ అప్పలనాయుడు, లబ్దిదారులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు మాజీ ఎమ్మెల్యే వితరణ



విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రంలో సంక్రాంతిపండుగ ముందు జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఏడు బాధిత కుటుంబాలవారికి మాజీ ఎమ్మెల్యే, టీడీపి నియోజక వర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు శనివారం సహాయంను అందజేసారు. ప్రభుత్వం తక్షణమే వారికి ఇల్లును మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతువేణుగోపాల నాయుడు, సాలాహరి, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ గరికయ్య, బుడితి శ్రీను, సబ్బాన శ్రీను, లక్ష్మణ, సింహాచలంనాయుడు,మూడడ్ల వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కళాశాల స్థాయి పోటీలు



విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శృంగవరపుకోటలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం. రమేష్ కుమార్ అధ్యక్షతన కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల స్థాయి పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ఎం.రమేష్ కుమార్, కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు బి.సంధ్యారాణి మాట్లాడుతూ పరిరక్షణలో ఓటర్ల చైతన్యం అతి ముఖ్యమైనదని సూచించారు. యువత ముందుండి ఓటర్లను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి ఓటు నమోదు ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం ఓటు హక్కు- ప్రాధాన్యత అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: కేట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపించారని పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యా సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కేట్ (నాలెడ్జ్ ఎసెస్మెంట్ టెస్ట్)లో విద్యార్థులు నగదు బహుమతులను సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. రూ.28వేలు క్యాష్‌ప్రైజ్ ను 162మంది విద్యార్థులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జగదీష్ డీన్ లు సాయి కిషోర్, సత్యనారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయనగరం: జనవరి 24 జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులు, పరిరక్షణ కోసం రూపొందించబడిన గోడ పత్రికను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు ఆవిష్కరించారు.జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలాస వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు కె.వి సూర్యనారాయణ

సైకో పోవాలి... సైకిల్ పాలన రావాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు రూరల్: రాష్ట్రంలో సైకో పాలన పోయి సైకిల్ రాజ్యం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని సాలూరు నియోజకవర్గ తెదేపా ఇంఛార్జ్ గుమ్మిడి.సంధ్యారాణి అన్నారు.శనివారం మండలంలో కూర్మరాజుపేట పంచాయతీ పునికిలవలస, చిన్నవలస గిరిజన గ్రామాల్లో జరిగే "ఇదేంఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సంధ్యారాణి హాజరయ్యారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.వైకాపా వ్యతిరేక విధానాలను,అమలు కానీ హామీలతో ప్రజలను ఏవిధంగా మోసం చేశారో వివరిస్తూ ఇంటింటికీ తిరుగుతూ పది అంశాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వపాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్షసాధింపులు,వేధింపులే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని విమర్శించారు. చంద్రన్న భీమా, సంక్రాంతి కానుకలు, చంద్రన్నబాట వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరల పొందాలంటే వచ్చే ఎన్నికలలో రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి తెలుగుదేశం పార్టీ కి మద్దతు ప్రకటించాలని గిరిజన ప్రజలను కోరారు. అనంతరం గ్రామ సమీపంలోని కల్లాలలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో ఆమెతో పాటు స్థానిక సర్పంచ్ ఆముదాల.నళిని, మక్కువ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుళ్ల వేణుగోపాల్ నాయుడు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, కోట లక్ష్మణ ,మండల టిడిపి సీనియర్ నాయకులు మత్స శ్యామ్ సుందర్,కరిబుగత,భాస్కరరావు, దొర లక్ష్మణ, ఆముదాల వెంకట్ నాయుడు, దామోదల కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంబర జాతరలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం: శంబర జాతరలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎడిషనల్ ఎస్పి డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్‌ను జనసేన నాయకులు కోరారు. శనివారం జనసేన జిల్లా నాయకులు వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీ శంకర్ తదితరులు జిల్లా ఎడిషనల్ ఎస్పీని కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంబర జాతరలో నాటుసారాతో పాటు ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా అమ్మకాలుచేసే మద్యం, బెల్ట్ షాపుల ద్వారా ఎక్కడ బడితే అక్కడ విచ్చలవిడిగా అమ్మకాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనివలన మందుబాబులు, ఆకతాయిలు ఫూటుగా మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి రోజుల్లో పార్వతీపురం పట్టణంలోని ఫ్లైఓవర్ పై రోడ్డు ప్రమాదాలు జరిగాయని, రానున్న వేసవి కాలంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ నాటుసారా నిషేధంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

నేటి కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష కు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆదివారం పట్టణ పరిసర ప్రాంతాల్లో జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు జరిగిందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతిపురంలో 19 పరీక్ష కేంద్రాల్లో ఈ వ్రాత పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుందని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, అవాంతరాలు లేకుండా ఈ పరీక్షను నిర్వహించడానికి ఒక అడిషనల్ ఎస్పీని, నలుగురు డీఎస్పీ లను, ఏడుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలను, కింది స్థాయి సిబ్బంది తో సహా సుమారు 300 మంది సిబ్బంది తో పటిష్టమైన భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష నిమిత్తం అభ్యర్థుల సౌలభ్యం కోసం ఆర్టీసీ వారు పార్వతిపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రత్యేక బస్సులను కూడా నడపడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలకు కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుందని,ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదన్నారు. పరీక్ష సందర్భంగా పార్వతీపురం పట్టణంలో ఇంటర్నెట్ సెంటర్లు గానీ జిరాక్స్ షాపులు గాని ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు తెరవకూడదని సూచించారు. పోలీసు వారి సూచనను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయన్నారు.

హెచ్చరికలు చేసినా భేఖాతర్...!

జగనన్న లేఅవుట్‌లలో నేటికీ పునాదులు వేయని లబ్దిదారులు



విశాలాంధ్ర-జామి: ప్రభుత్వం నిరుపేదలకు సొంత గూడు ఉండాలనే లక్ష్యంతో ఇంటి స్థలాన్ని ఇచ్చి గృహనిర్మాణానికి రుణాన్ని మంజూరు చేస్తున్నా కొన్ని గ్రామాలలో లబ్దిదారులు నేటికీ ముందుకురాని పరిస్థితి కొనసాగుతోంది. మండల కేంద్రమైన జామిలో మూడు లేఅవుట్‌లను వేసి లబ్దిదారులకు ఇళ్ళ స్థలాలను కేటాయించారు. కానీ అతిపెద్ద లేఅవుట్‌గా ఉన్న చుక్కవారికొండ వద్ద దాదాపు 90 మందికి కేటాయించినా ఇప్పటికీ 20మంది వరకు పునాదులు వేయని పరిస్థితి ఉంది. అలాగే దొండపర్తి వద్ద 30 ఇళ్ళకు ముగ్గురు పునాదులు వేసేందుకు ముందుకు రావడం లేదు. అలాగే మరోచోట 46మందికి గాను 10మంది లబ్దిదారులు నిరాసక్తిగా ఉన్నారు. వీరికి స్థానిక సచివాలయాల ద్వారా హెచ్చరికల నోటీసులను గతనెలలోనే ఇవ్వడం జరిగింది. కొందరు స్థానికంగా ఉండడం లేదని సమాచారం. మరికొందరు తాము కట్టలేమని చెబుతుండగా, కొందరుకు ఇప్పటికే సొంత ఇళ్లలు ఉండడంతో రెండో ఇళ్లను కట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇళ్ళను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని ఒకవైపు అధికారులు పైనుంచి వత్తిడి తెస్తున్నా స్థానికంగా ఉన్న సమస్యలపై ఇక్కడి అధికారులు ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేకపోతున్నారు. కొందరికి పునాదులు వేసేందుకు ముందస్తుగా రుణాన్ని కూడా అందజేసామని, అయినా వారు ప్రారంభించలేదని సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు. ఇటువంటి లబ్దిదారులపై అధికారులు మరింత వత్తిడి చేయించాల్సి ఉంది. లేని యెడల వారికి కేటాయించిన స్థలాలను రద్దు చేసి పేదలకు అందజేస్తే ఉపయోగం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

వైద్యసాయం నిమిత్తం రూ.25 వేలు అందించిన జెడ్పి చైర్‌పర్సన్

విశాలాంధ్ర-విజయనగరం: గుర్ల మండలం కోటగండ్రేడు గ్రామానికి చెందిన వాలంటీర్ ఇప్పిలి శ్యామల కుమార్తె ఇప్పిలి పుష్పితకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చెక్కును జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) శనివారం అందించారు. జిల్లా పరిషత్ నిధులనుంచి ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమం లో పలాస వైసీపీ పరిశీలికులు కేవీ సూర్యనారాయణ రాజు (పులి రాజు), కోటగండ్రేడు సర్పంచ్ ఎం.నివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కింగువ మధు, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు ముద్దడ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ద్వారా కులాల సంక్షేమం, అభివృద్ధి

టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ ద్వారా కులాల సంక్షేమ అభివృద్ధి చేయడం జరు గుతుందని రాష్ట్ర టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు శనివారం రాష్ట్ర బి.సి.కార్పొరేషన్ ఛైర్మెన్ .మామిడి శ్రీకాంత్ కి డైరెక్టర్ .రంఘుముద్రి రమాదేవికి శుభాకాంక్షలు టిడ్కో ఛైర్మన్ . జమ్మాన ప్రసన్న కుమార్ తెలియజేశారు. ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని కులాల సంక్షేమం, అభివృద్ధి మరియు తద్వారా ప్రభుత్వం ప్రజ లకు మరింత చేరువ అవ్వాలనే దృఢ సంకల్పముతో సుమారుగా 56 కులాల సంక్షేమం కోసం ఆయా కార్పొరేషన్లుకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించడం జరిగిందన్నారు వివిధ కార్పొరేషన్లు చైర్మన్లు, డైరెక్టర్లు పదవీ కాలాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగించిన సందర్భముగా రాష్ట్ర బి.సి.కార్పొరేషన్ చైర్మన్ .మామిడి శ్రీకాంత్ ని మరియు డైరెక్టర్. రంగుముద్రి రమాదేవిని ఆత్మీయం అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్రసన్న కమార్ మాట్లాడుతూ రాష్ట్ర టిడ్కో హౌసింగ్ ఛైర్మన్ గా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మరియు అవసరమైన మేరకు తన సహాయ సహకారాలు అందిస్తామన్నారు ఆయా కార్పొరేషన్ల ద్వారా ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి గారికి ఆజన్మాంతం ఋణపడి అటు పార్టీ కు మరియు ప్రజలకు మంచి జరిగే విధముగా మన్ననలను పొందాలని అభిలాషించారు.

ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక జిల్లా రవాణా అధికారి కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలతో ఆటో, లారీ క్యాబ్ తదితర వాహనాల డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 400 మందికి తనిఖీలు చేపట్టడం జరిగిందని జిల్లా రవాణా శాఖ అధికారి సి.మల్లికార్జున రెడ్డి తెలిపారు.ఈ వైద్య పరీక్షల్లో బిపి షుగర్ శరీర దృఢ పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ జరిగిందన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ యం.శశి కుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు జి.సత్యనారాయణ, ఎ.వరప్రసాద్, బి.కాశీరాం నాయక్, డాక్టర్ సి హెచ్ ప్రతాప్, డాక్టర్ పి.నారాయణరావు, ల్యాబ్ టెక్నీషియన్లు జి.సుమన్, టి.వెంకట రమణ, ఆప్తాలమిక్ ఆఫీసర్ శ్రీరామ్,ఎ.శ్వేత స్టాఫ్ నర్స్, రవాణా శాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ 'గృహ ఆధారిత విద్య' పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం సహిత విద్యా విభాగం ద్వారా "గృహ ఆధారిత విద్య" పరిశీలనలో భాగంగా ఎంఈఓ జే.త్రినాథ్‌రావు నందబలగ గ్రామానికి చెందిన గంట నాగమణి, 7.వ తరగతి విద్యార్థిని గృహమును సందర్శించారు. విద్యార్థిని ఆరోగ్య, మానసిక స్థితిగతులను గూర్చి పరిశీలించారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థి యోగ క్షేమాలను తెలుసుకున్నారు.విద్యార్థి మానసిక, శారీరిక, భౌద్ధిక ప్రగతికి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఏ. సూర్యా రావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ పి నారాయణ రావు కోరారు. నెల్లిమర్ల స్టేట్ బ్యాంక్ జంక్షన్ వద్ద రహదారి భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవ హారం నిర్వహించారు. ఎస్ఐ నారాయణ రావు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. ప్రతిఒక్కరూ సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ సత్యనారాయణ, గౌరినాయుడు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుకు తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి రోడ్ల గల సురేష్ పాఠశాల స్కూల్ కి చెందిన బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లిపోయిన సంఘటనలో విద్యార్థులు ఎవరికి గాయాల కాకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. బొబ్బిలి నుండి సుమారు 30 మంది విద్యార్థులతో ప్రయాణం చేస్తుండగా అప్పయ్యపేట-రంగరాయపురం మధ్యలో అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్ళిపోయింది.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపీపీ

విశాలాంధ్ర-వేపాడ: జగనన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరిత గతిన పూర్తిచేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవం తుడు అన్నారు. మండలంలోని ఆతవ సచివాలయం పరిధిలో ఆతవ, ఆకుల సీతంపేట గ్రామాలలో శనివారం మండల పరిషత్తు అభివృద్ధి అధికారి సాయి కూర్మనాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో హౌసింగ్ డే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నాడు ఎన్నికల ముందు పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని కావున ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని కావున లబ్ధిదారులు అందరూ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు ఆయా గ్రామాల సర్పంచులు గొంప వేమన రాము(నాయుడు) సుంకరి రామలక్ష్మి నాయకులు నాగిరెడ్డి శివ సత్యం నాయుడు(జగన్) కేదారి బుల్లిబాబు మండల తహసీల్దారు ఎస్ కృష్ణంరాజు గృహ నిర్మాణ శాఖ ఏఈ అప్పలనాయుడు, హౌసింగ్ సిబ్బంది, వైయస్సార్ క్రాంతి పదం ఏపిఎం శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం ఏపీఓ సన్యాసినాయుడు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు సచివాలయం కన్వీనర్లు హౌసింగ్ లబ్ధిదారులు హాజరయ్యారు.